www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 16 ఫిబ్రవరి 2025
5
చిత్తూరు



నిర్ణీత గడువు లోపు లక్ష్యాలను పూర్తి చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద్ రావ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో చిత్తూరు జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం ఎంపి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా జిల్లా అభివృద్ధికి కావలసిన నిధుల మంజూరుకు జిల్లా కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపాలని, ప్రతిపాదనలు క్షుణ్ణంగా, శాస్త్రీయంగా తయారు చేయాలన్నారు. వ్యవసాయ, పశు సంవర్ధక, ఉద్యాన శాఖలు, రోడ్ల నిర్మాణం, వైద్యరంగాలకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రభుత్వం నుండి అందిన నిధులను సకాలంలో సద్వినియోగం చేసుకుని జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంఎస్ఎంఈ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకుల ద్వారా రుణాల మంజూరుకు చర్యలు చేపట్టాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల పెంపు పై అధికారులు దృష్టి పెట్టాలని తెలిపారు. జిల్లాలో అవసరాల మేరకు నిధులు రాబట్టడానికి జిల్లా యంత్రాంగం ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేసే పథకాల ద్వారా దారిద్ర్యరేఖకు దిగువనున్న వారు అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలలో రిజర్వేషన్ మేరకు అర్హుల ఎంపిక పక్కాగా చేయాలని తెలిపారు. ఇప్పటికే ఎస్సి, ఎస్టి హ్యాబిటేషన్‌లలో అమలవుతున్న అభివృద్ధి పథకాలను వేగవంతంగా నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా సంబంధిత అధికారులు పని చేయాలన్నారు. జల్ జీవన్ మిషన్ అమలు పై సమీక్షించి రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని గ్రామాలలో నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలో మామిడితో ఇతర ఉద్యాన పంటల సాగుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం అందించే నిధులను సకాలంలో సద్వినియోగం చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా కృషి చేయాలన్నారు. విద్యాశాఖకు సంబంధించి మెరుగైన విద్యను విద్యార్థులకు అందించేలా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కలెక్టర్ మాట్లాడుతూ నరేగా ద్వారా 90 లక్షల పని దినాలు లక్ష్యంగా పెట్టుకుని 75 లక్షల పని దినాలు కల్పించడం జరిగిందన్నారు. మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.150 కోట్లు మంజూరు చేశామని, ఇందులో రోడ్డు నిర్మాణాలకు సంబంధించి 1600 పనులకు గానూ రూ.100 కోట్లు ఖర్చు పెడుతున్నామన్నారు. పుంగనూరు నియోజకవర్గానికి సంబంధించి చెరువుల నిర్మాణం, పైపులైన్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో రెండు ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, ఈ నియోజకవర్గాలలో సిసి రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖను ఆదేశించామని తెలిపారు. వ్యవసాయరంగ అభివృద్ధికి రాష్ట్రీయ కృషివిజ్ఞాన్ యోజన, ఎంఐడిఎస్, మైక్రో ఇరిగేషన్ ద్వారా చేయూత అందిస్తున్నామని తెలిపారు. మ్యాంగో బోర్డు, కుప్పంలో కేంద్రీయ విద్యాలయం, సెంటర్ ఫర్ సెరికల్చర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వానికి డిపిఆర్‌లు పంపడం జరిగిందన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద రూ.3.50 కోట్ల నిధులు రావడం జరిగిందని, ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎంపి ల్యాడ్స్ కింద రూ.5 కోట్లు మంజూరు కాగా, 60 శాతం పనులు పూర్తి చేశామని, బిల్లులు చెల్లింపు జరుగుతుందన్నారు. జిల్లాకు సంబంధించి సిసి రోడ్లు, కాంపౌండ్ వాల్స్, ఓవర్ హెడ్‌ట్యాంక్స్ నిర్మాణాలు, తాగునీటి సౌకర్యాల పనుల ప్రగతి పై ప్రతినెలా సమీక్షించడం జరుగుతున్నదన్నారు. నరేగా నిధుల ద్వారా క్రీడాభివృద్ధికి సంబంధించి ప్రతి పాఠశాలలో ఫుట్ బాల్, వాలీ బాల్ కోర్టులు, పాఠశాల మౌలిక వసతుల ఏర్పాటు, శ్మశానాలలో వసతులు ఏర్పాటు, సిసి రోడ్ల నిర్మాణానికి, అంగన్వాడీ భవనం, మరుగుదొడ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈసమావేశంలో జెడ్పి సీఈఓ రవికుమార్ నాయుడు, పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్‌ఎస్‌ఈలు చంద్రశేఖర్ రెడ్డి, విజయ్ కుమార్, డ్వామా, హౌసింగ్ పీడీలు రవి కుమార్, గోపాల్ నాయక్, డీఈఓ వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసి వెంకటరమణ, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీ కృష్ణ, మధుసూదన్ రెడ్డి, డాక్టర్ ప్రభాకర్, సీపీఓ సాంబశివా రెడ్డి, ఎల్డిఎం హరీష్, జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వరి, డీఎస్ఓ శంకరన్, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

వివాదాల బస్టాండ్..

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా కేంద్రమైన చిత్తూరులో వివాదాలకు కేరాఫ్‌గా కాసు బ్రహ్మానందరెడ్డి పాత బస్టాండు మారింది.. అభివృద్ధి పేరిట హైరోడ్డు విస్తరణ పేరుతో కాసు బ్రహ్మానందరెడ్డి పాత బస్టాండు మూసి మూసివేశారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా అభివృద్ధి ప్రధానంగా చిత్తూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని పదేపదే చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కూటమి నాయకులు స్పష్టం చేస్తూ కట్టమంచి నుండి రెడ్డిగుంట వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. ముందుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపు ప్రభుత్వ భవన ప్రహరీ గోడలను జెసిబిల ద్వారా కూల్చివేస్తున్నారు. మొదట్లో రోడ్డు విస్తరణ పనులను అడ్డుకున్న భవన యజమానులు ఎమ్మెల్యే సర్ది చెప్పడంతో కాస్త వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. హైరోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలోనే చిత్తూరు పాత బస్టాండు అంశం గత వారం రోజులుగా చిత్తూరులో హాట్ టాపిక్‌గా మారింది.

మూడు ఎకరాలకు పైగా ఉన్న పాత బస్టాండు ఆవరణంలో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామంటూ నగరపాలక సంస్థ కూటమి నేతలు చెబుతున్నారు. ఈ మేరకు వారం రోజుల క్రితం పాత బస్టాండ్ లోనికి బస్సులు రానివ్వకుండా చుట్టూ రేకులతో ప్రహరీ గోడ ఏర్పాటు చేశారు. పాత బస్టాండ్‌లోని కూరగాయల చిరువ్యాపారుల దుకాణాలను తొలగించి రైతు బజారుకు మార్చారు. పాత బస్టాండ్‌లో తాత్కాలికంగా షెడ్యూల్ ఏర్పాటు చేసుకున్న షికారులను వెంటనే ఖాళీ చేయాలంటూ మున్సిపల్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. చిన్నపాటి నిర్మాణాల్లో వ్యాపారాలు చేసుకుంటున్న వారికి ఖాళీ చేయాలంటూ నగరపాలక సంస్థ నోటీసులు అందజేయడంతో 'దశాబ్దాల కాలం నుంచి ఇక్కడే వ్యాపారాలు నిర్వహించుకుంటున్నాం.. ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి పాత బస్టాండులో షాపులు నిర్మించుకున్నామంటూ' పాత బస్టాండ్ షాప్ యజమానుల సంఘం పాత బస్టాండ్ మూసివేతపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

1946లో నగరపాలక సంస్థకు డబ్బులు చెల్లించి షాపులు ఏర్పాటు చేసుకున్నామని ఉన్నట్టుండి ఖాళీ చేయాలంటే ఎక్కడికి పోవాలని ప్రశ్నిస్తున్నారు. పాత బస్టాండు మూసివేత అధికార ప్రతిపక్షాల మధ్య అగ్గిరాజేస్తోంది. ప్రతిపక్ష వైసిపి పాత బస్టాండ్‌లోని సమావేశం నిర్వహించి చిరు వ్యాపారులకు అండగా ఉంటామంటూ అభివృద్ధి పేరిట చిరు వ్యాపారుల పొట్టకొట్టే ప్రయత్నం చేస్తే దశలవారి పోరాటాలకు పూనుకుంటామంటూ వైసిపి నేతలు హెచ్చరించారు. ఏది ఏమైనాప్పటికీ పాత బస్టాండ్ నమ్ముకొని 20 షికారిల కుటుంబాలు, 50కి పైగా చిరువ్యాపారులు జీవనం సాగిస్తున్నారు. వీరికి ప్రత్యామ్నాయం చూపడంతో పాటు నష్టపరిహారం చెల్లించాలని వ్యాపారులు కోరుతున్నారు.



చిత్తూరు నగరంలోని పాత బస్టాండ్ చుట్టూ రేకులతో ఏర్పాటు చేసిన కంచె

8న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మార్చి 8వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవ అధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యాలయంలో మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర న్యాయసేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ, సుప్రీంకోర్టు వారి ఆదేశాల మేరకు మార్చి 8న ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతుందని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని దానిపై అపీల్ ఉండదన్నారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాల రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు, మోటార్ వాహనాల కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంక్ కేసులు, మొదలగు కేసులను రాజీ చేసుకోవచ్చు అన్నారు. కక్షదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయ మూర్తులు, న్యాయ వాదులు, రెవెన్యూ, పోలీసు, బ్యాంకు అధికారులు, చిట్ ఫండ్ కంపెనీలు, బీమా సంస్థ ప్రతినిధులు, కక్షదారులు పాల్గొని విజయవంతంగా నిర్వహించి జిల్లాలో ఎక్కువ కేసులు పరిష్కరించి చిత్తూరు జిల్లాను రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో ఉండేలా సహకరించాలన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి :మేయర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలో పటిష్ట పారిశుధ్య పనుల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు తడి, పొడి చెత్తను వేరు చేయడంపై అవగాహన పెంచుకోవాలని మేయర్ ఎస్.అముద చెప్పారు. శనివారం నగరపాలక పరిధిలోని దుర్గానగర్ కాలనీ పార్క్‌వీధిలో 'స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా స్థానికులకు తడి, పొడి చెత్తను వేరు చేయడం, హోమ్ కంపోస్టింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి గృహంలోనూ వ్యర్థాలను తడి, పొడి రూపంలో వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. అధిక మొత్తంలో వ్యర్థాలను ఉత్పత్తి చేసేవారు హోమ్ కంపోస్టింగ్ విధానాన్ని నిర్వహించడం ద్వారా సేంద్రియ ఎరువుల తయారు చేయాలన్నారు. కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య నిర్వహణ, స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలకు ప్రజల సహకరించాలని కోరారు. ఐహెచ్ఆర్పీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్కే శోభారాణి స్థానికులకు మూడు రంగుల చెత్త డబ్బాల్లో ఎలాంటి వ్యర్థాలను వేయాలి, హోం కంపోస్టింగ్ ఎలా చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణంలో అంబేద్కర్ భవనం ప్రహరీ నిర్మాణాన్ని శనివారం దళిత నాయకులు ప్రారంభించారు. ముందుగా జెసిబితో అంబేద్కర్ భవన స్థలాన్ని శుభ్రపరిచారు. అనంతరం అంబేద్కర్ భవన నిర్మాణానికి చేపట్టవలసిన కార్యక్రమాలను వినతిపత్రంలో పొందుపరిచి కడా పీడీ వికాస్ మరమత్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక కమ్యూనిటీ భవన నిర్మాణాలకు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వమే కేటాయిస్తూ భవన నిర్మాణాలను సైతం ప్రభుత్వమే చేపట్టినట్టు తెలిపారు. అయితే పట్టణంలో ఉన్న అంబేద్కర్ భవన స్థలం 40సెంట్లు మాత్రం దళిత సంఘాలు కొనుగోలు చేయడం జరిగిందని, బాగున్న నిర్మాణానికి మాత్రమే ప్రభుత్వం సహాయం అందించినట్టు తెలిపారు. ఇది గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో భాగంగా కుప్పం నియోజకవర్గంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి ప్రభుత్వం తరపున చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం అంబేద్కర్ భావన స్థలం 40సెంట్లుకు ప్రభుత్వం మరో 50సెంట్ల స్థలాన్ని సేకరించి, అంబేద్కర్ భవన నిర్మాణం నిర్మించి ఇవ్వాలని కోరారు. టిడిపి ఎస్సీసెల్ కుప్పం నియోజకవర్గ అధ్యక్షులు సుబ్బు, నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, రాజకుమార్,డాక్టర్ వెంకటేష్, కందస్వామి, విక్టరీ బోర్డింగ్ పాఠశాల స్పందన్, బాబు నగర్ గణేష్, మురుగేష్ పాల్గొన్నారు.



గ్రామీణ బ్యాంక్ జోనల్ బ్రాంచ్‌ని తరలించవద్దు

రాయలసీమ అభివృద్ధి వేదిక డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాయలసీమ జిల్లాలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు జోనల్ బ్రాంచ్ కడపలో ఉన్నదాన్ని అమరావతికి తరలించాలని ఆలోచన విరమించుకోవాలని శనివారం రాయలసీమ అభివృద్ధి వేదిక డిమాండ్ చేసింది. ఈసందర్భంగా అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించడం జరిగింది. రాయలసీమ అభివృద్ధి వేదిక చిత్తూరు జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ రాయలసీమ ఇప్పటికీ వెనుకబడిందని విభజన చట్టంలో హామీలు ఏవీ కూడా రాయలసీమలో అమలు కావడం లేదని విమర్శించారు. ఇక్కడున్న ఆఫీసులను కూడా అమరావతికి తరలిస్తే రాయలసీమను పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చేతులెత్తేశారని, కనీసం ఉన్న కార్యాలయాలను కూడా తరలించడం ఏమిటని ప్రశ్నించారు. ఇవైనా ఉండడం వల్ల రవాణా ఉపాధి ఇతర సౌకర్యాలు ప్రజలకు కొంత వరకు అందుతున్నాయని, బయటకు తరలిపోతే ఇక్కడ అన్ని రకాలుగా వెనుకపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ గ్రామీణ స్థాయిలో మహిళలకు అనేక రకాల పొదుపు రుణాలు ఇవ్వడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని, ఇలాంటివి అందుబాటులో ఉండాలి కానీ వాటిని దూరం ప్రాంతాలకు తరలించేలే చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. మరిన్ని కార్యాలయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి రాయలసీమ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు జోనల్ కార్యాలయం కడపలోనే ఉండేవిధంగా చర్యలు తీసుకోకపోతే రాయలసీమ జిల్లాలోని అన్ని చోట్ల పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల, అభివృద్ధి వేదిక నాయకులు నాగరాజు, సురేంద్ర, బాల సుబ్రమణ్యం, మనీ పాల్గొన్నారు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రోడ్డు భద్రతా నియమాలను పాటిద్దాం..

విలువైన ప్రాణాలను కాపాడుకుందాం..: ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రోడ్డు భద్రతా నియమాలను పాటించి, విలువైన ప్రాణాలను కాపాడుకుందామని యువతకు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సమావేశాలను శనివారం చిత్తూరు నియోజకవర్గంలోని మురకంబట్టు వద్ద ఉన్న ఎస్వీ సెట్ కళాశాలలో నిర్వహించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల అవగాహన కార్యక్రమానికి ఎంపి, ఎమ్మెల్యేలు, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత అతిథులుగా హాజరై, రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఈ ప్రమాదల వల్ల ఎన్నో కుటుంబాలు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్లే ప్రభుత్వం రోడ్డు భద్రతా వారోత్సవాలకు శ్రీకారం చుట్టి, రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పిస్తోందన్నారు. ఈ విషయాన్ని యువత దృష్టిలో ఉంచుకొని, రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ రోడ్డు ప్రమాదాలకు దూరం కావాలని వారు సూచించారు. మన భద్రతే కుటుంబ భద్రత అని హితబోధ చేశారు. కార్యక్రమంలో డిటిసి నిరంజన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ప్రసాద్‌రావు

అభివృద్ధి చేయడం నేరమా..

ప్రజాధనం ఎక్కడ వృథా అవుతోంది..: ఎంపిడిఓ

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల అభివృద్ధి కార్యాలయాన్ని అభివృద్ధి చేయడం నేరమా అని కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండల అభివృద్ధి కార్యాలయంలో కొన్ని మౌళిక వసతులు దుస్థితికి చేరుకున్నాయని, దీంతో గతనెల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మండల అభివృద్ధి కార్యాలయంలో దుస్థితికి చేరుకున్న మౌలిక వసతుల అభివృద్ధి కోసం తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా మరుగుదొడ్ల మరమ్మతులు, భవనానికి పెయింటింగ్ వంటి పనులు చేపడుతున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ఎంపిడిఓ కార్యాలయానికి నిత్యం పలు పనులపై మండల పరిధిలోని 22 పంచాయతీల నుంచి సర్పంచ్లు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు అత్యధికంగా మహిళలు రావడం జరుగుతుందని, వారి సౌకర్యార్థం నిధులు వెచ్చించి మరుగుదొడ్లు మరమ్మతులు, పలు పునర్నిమాణాలు చేపట్టడం జరుతున్నాయని చెప్పారు. అయితే కొందరు ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజాధనం ఎక్కడ వృదా అయిందో నిరూపించాలన్నారు. ప్రజలకు అవసరమైన వసతులు కల్పించడమూ నేరమా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని విషప్రచారాలు చేసినా అభివృద్ధి పనులు ఆగవని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రమౌళి

మద్యం మత్తులో

భార్యను హతమార్చిన భర్త

ప్రజాశక్తి- శాంతిపురం: శాంతిపురం మండలం కడపల్లి పంచాయతీ మాదనపల్లి గ్రామానికి చెందిన మునస్వామి అనే వ్యక్తి మద్యం మత్తులో తన భార్య మంగమ్మ (38) తలపై రాడ్డుతో దాడి చేసి హత్య చేశాడు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మునస్వామి మంగమ్మలకు 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కూలిపనులుపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబం. వీరికి ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొడుకు ప్రకాష్ ఐటిఐ చదువుతుండా, రమ్య 10వ తరగతి, కావ్య 5వ తగరతి చదువుతున్నారు. మద్యానికి బానిసైన మునస్వామి నిత్యం మద్యం కొనడానికి డబ్బులు ఇవ్వాలని భార్యను వేధించేవాడని, ఈ నేపథ్యంలోనే శుక్రవారం రాత్రి మద్యంకు డబ్బులు ఇవ్వలేదనే కోపంతో మంగమ్మను హత్య చేశాడని తెలిపారు. మృతురాలి సోదరుడు ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాళ్ళబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అలాగే నిందితుడు మునస్వామిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఆక్రమిత ప్రభుత్వ భూమి స్వాధీనం



ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకుంటున్న తహశీల్దార్, పోలీసులు

ప్రజాశక్తి - విజయపురం (నగరి): మండలంలోని గుండ్రాజుకుప్పం గ్రామంలోని సర్వే నెంబరు 97/1, 97/4, 97/3లోని ఆక్రమణకు లోనైన 3.41 ఎకరాల ప్రభుత్వ భూమిని తహశీల్దార్ రవికుమార్ శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ అనాధీన భూమిని బాలప్రసాద్ అనే వ్యక్తి ఆక్రమించుకుని క్రషర్ నడుపుతున్నారని, సుమారు 20యేళ్లపాటు ఇది జరుగుతోందన్నారు. ప్రస్తుత సర్వేలో ఇది గుర్తించడం జరిగిందన్నారు. సంబంధిత వ్యక్తికి ప్రభుత్వం తరపునుంచి ఎలాంటి రికార్డులు లేవన్నారు. దీంతో వారికి నోటీసులు జారీచేయడమైందని అయితే సంబంధిత వ్యక్తి కలెక్టర్ కోర్టుకు అప్పీలు చేసుకున్నారని అక్కడ వీటిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ సంబంధిత భూమి అనాధీన భూమి అని తేల్చడం జరిగిందన్నారు. దీంతో క్రషర్ నడుపుతున్న ప్రభుత్వ సంబంధిత భూమిని సీఐ మహేశ్వర్, పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో పాటు వెళ్లి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. స్వాధీనం చేసుకున్న ఆక్రమిత భూమి విలువ సుమారు రూ.3 కోట్లు విలువ ఉంటుందన్నారు.

కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి..

జాతీయ కమిటీల్లో సభ్యునిగా చిత్తూరు ఎంపీకి అవకాశం



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆయన రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి.., అంతకంటే చిత్తూరు పార్లమెంటు సభ్యులుగా ప్రజాసేవ చేస్తున్న ప్రజాప్రతినిధి.., సేవకు ప్రతిరూపం.. ఆయనే చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు. కర్తవ్యం నిర్వహణను చిత్తశుద్ధితో వ్యవహరించే ఆయన్ను జాతీయస్థాయిలో పలు పదవులు వరించాయి. ప్రసాదరావు పనితీరును, సేవను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం నేషనల్ కమిటీల్లో సభ్యునిగా ఎంపిక చేసి, గురుతర బాధ్యతను చిత్తూరు ఎంపీ పై పెట్టింది. తాజాగా జాతీయ ఇన్కమ్ టాక్స్ బిల్లు సెలెక్టెడ్ కమిటీలో పనిచేసే అవకాశం కల్పించింది. ఇదంతా ఒక ఎత్తైతే.. ప్రసాదరావు సామర్థ్యాన్ని ఎప్పుడో గుర్తించిన ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు పార్లమెంటు అభ్యర్థిగా బరిలో దింపి 2024 సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించారు. చిత్తూరు పార్లమెంటు సభ్యులుగా, టిడిపి పార్లమెంటరీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న దగ్గుమళ్ళ ప్రసాదరావు పరిపాలన దక్షతను, ప్రతిభను, నైపుణ్యాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో జాతీయ కమిటీలలో సభ్యునిగా ఎంపిక చేసింది. సుమారు ఐదు కేంద్ర కమిటీలలో మెంబర్‌గా స్థానం కల్పించి ఆయన పరిపాలన అనుభవాన్ని దేశసేవకు వినియోగించాలని సంకల్పించింది. జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు, జాతీయ ఫార్మా ఎరువులు, రసాయనాల స్టాండింగ్ కమిటీ సభ్యులు, జాతీయ సోషల్ జస్టిస్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ మంత్రిత్వ శాఖలో కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా, కొత్తగా ప్రవేశపెట్టిన ఆదాయ పన్ను బిల్లు ఎంపిక కమిటీలో సభ్యునిగా, కేంద్ర రైల్వే కన్సల్టేటివ్ కమిటీలలో పనిచేసే అవకాశాన్ని కల్పించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు పార్లమెంటు సభ్యుడైన దగ్గుమళ్ళ ప్రసాదరావు ఐదు జాతీయ కమీటీలలో పనిచేసి అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. తెలుగు జాతి కీర్తిని ఇనుమడింపజేసారు.

50 శాతం సబ్సిడీతో పాలిథిన్ కవర్లు

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: జిల్లాలోని మామిడి రైతులకు 50శాతం సబ్సిడీతో పాలిథిన్ కవర్లు సరఫరా చేస్తున్నట్లు ఉద్యానవన శాఖ డిడి మధుసూదన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మామిడి రైతులు పాలిథిన్ కవర్ల కోసం స్థానిక ఉద్యానవన శాఖ సిబ్బంది, ఆర్బికె సిబ్బందిని సంప్రదించాలని కోరారు. మామిడి పంట విస్తీర్ణం తెలిపే పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డును ఇవ్వాలని కోరారు. మామిడికాయల నాణ్యత పెరిగేందుకు పాలిథిన్ కవర్లు ఎంతగానో ఉపయోగపడతాయని 50శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తున్న కవర్లు మామిడి రైతులందరూ తీసుకొని దిగుబడి, నాణ్యత పెరిగేందుకు కృషి చేయాలని కోరారు.



సోదాలు నిర్వహిస్తున్న ఎఎస్ఐ రామచంద్రారెడ్డి

అక్రమ మద్యం విక్రయాలపై సోదాలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: అక్రమ మద్యం విక్రయాలపై సోదాలు చేపట్టామని ఎఎస్ఐ రామ చంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివా రం మండల కేంద్రం లోని అక్రమ మద్యం విక్రయం లపై వచ్చి న సమా చారం తో సోదాలు చేపడు తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం విక్రయాలకు సమయం నిర్ణారించిన సమయం లోనే విక్రయాలు చేయాలని మద్యం దుకాణాల్లో ముందస్తు కొనుగోలు చేసుకొని మద్యం ప్రియులకు అధిక ధరలకు మద్యం విక్రయి స్తున్నారనే ఆరోపణలు ఎక్కువ కావడంతో సోదాలు నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు రమేష్, ద్వారకనాథ్, పలువురు పోలీసు లు పాల్గొన్నారు.

నాటు సారా తయారీ స్థావరాలపై దాడి



నాటు సారా ఊటలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండ లం లోని యనమల మంద పరిస రాల ప్రాంతం లో నాటు సారా తయారీ స్థావరాలపై ఎస్ఐ వెంకటసుబ్బయ్య శనివారం తమ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఊటను ధ్వంసం చేశారు. చట్ట వ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడి తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సోమల: సోమల మండలం నంజంపేట వారపు సంత నిర్వహణ స్థలంలో ఆదివారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో క్యాన్సర్, గుండె, కిడ్నీ, ఎముకలు, బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్ వంటి సమస్యలతో బాధపడే వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఈసీజీ , ఎకో వంటి పరీక్షలు ఉచితంగా చేస్తామని, చికిత్స అవసరమైన వారికి ఎన్టీఆర్ ఆరోగ్య సేవ ద్వారా వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి వచ్చే వారు తమ వెంట ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తీసుకుని రావాలని తెలిపారు.

సదుం ఎంపిటిసి ఆనంద్ మృతి

ప్రజాశక్తి - సదుం: సదుం మేజర్ గ్రామానికి చెందిన ఎంపిటిసి బీసే పల్లి ఆనంద్ (55) అనారోగ్య కారణాలతో తిరుపతిలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ శనివారం మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆనంద్ అంత్యక్రియలు ఆదివారం నిర్వహించ నున్నారు. ఎంపిటిసి మృతి వార్త విన్న సదుం గ్రామ ప్రజలు, ఆతని అభిమానులు, కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగి పోయారు. ఆతనికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. గతంలో సదుం మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా, సదుం ఉప సర్పంచ్ గా సేవలందించారు. గత స్థానిక ఎన్నికల్లో సదుం మేజర్ పంచాయతీకి వైసిపి నుండి పోటీచేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆతను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడుగా, విధేయుడుగా మెలిగారు. ఆతను మృతి పట్ల వైసిపి నాయకులు, ఆతని అభిమానులు, సదుం గ్రామస్తులు, పెద్ద ఎత్తున సానుభూతి తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు

తల్లిబిడ్డ క్షేమం

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి : మండలంలోని ఏం కొత్తూరు పంచాయతీ పరిధిలోని రామసముద్రం గ్రామంలో నివసిస్తున్న షాబీర్ బాషా భార్య షాహినా (24) నిండు గర్భిణి, కాన్పు సమయం సమీపించడంతో ఆశ వర్కర్ సహకారంతో ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు సురక్షితమని షాహినా కుటుంబ సభ్యులకు నచ్చచెప్పి తీర్థం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పారు. డాక్టర్ పద్మావతి పర్యవేక్షణలో సురక్షితమైన కాన్పు నిర్వహించడంతో షాహినాకు ఆడ శిశువు జన్మించింది. ఈ సందర్భంగా డాక్టర్ బసర కుమార్ మాట్లాడుతూ ఎలాంటి కాన్పులైనా తల్లి బిడ్డ క్షేమంగా ఉండాలంటే ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు చేయించుకోవడం సురక్షితమని అన్నారు డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ మొట్ట మొదట ఆశ వర్కర్ కు అభినందనలు తెలిపారు. షాహినా కుటుంబ సభ్యులు ప్రైవేట్ హాస్పిటల్ కి పోవా లంటే ఖర్చు అవుతుందని ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే ఎంత ఖర్చైనా ప్రభుత్వమే భరిస్తుందని వారి కుటుంబ సభ్యులకు నచ్చచెప్పి షాహినాను తీర్థం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అనంతరం డాక్టర్ పద్మావతి టాప్ నర్స్ ధనకొండ కలిసి సురక్షితమైన కాన్పు నిర్వహించినందుకు షాహినా కుటుంబ సభ్యులు వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల విద్య బలోపేతమే లక్ష్యం: ఎంఈవో

ప్రజాశక్తి -పలమనేరు: పాఠశాల విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎంఈవో లీలారాణి పేర్కొన్నారు. విద్యాశాఖ వారు కొత్తగా స్కూల్ కాంప్లెక్స్ ప్రైమరీ లెవెల్ , సబ్జెక్టు లెవెల్ సమీక్ష సమావేశాలను శనివారం పలమనేరు లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలమనేరు ఎంఈవో లీలారాణి గవర్నమెంట్ హై స్కూల్ సిఆర్‌సి ని సందర్శించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయ డానికి ముఖ్య ఉద్దేశం ఉపాధ్యాయులతో మెగా సమావేశాలు నిర్వహించి నాణ్యమైన బోధనను మెరుగు పరచడం, కాంప్లెక్స్ పరిధిలో ఏ పాఠశాల మెరుగ్గా ఉంది? ఏ పాఠశాల వెనుకబడి ఉంది.. దానికి అనుసరిస్తున్న బోధన పద్ధతులు ఏమిటి? పిల్లలు మెరుగ్గా రాణించడానికి అనుసరిస్తున్న వ్యూహాలు ఏమిటి? పిల్లలు అభ్యసన సామర్థ్యం ఎలా వుంది? ఇగతంలో నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మార్కులు ప్రగతి నివేదికలపై సమీక్ష ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు ప్రసంగించారు. ఈ సమీక్ష సమావేశాలను విజయవంతం చేయడానికి కృషి చేసిన సీఆర్పీలు, హరిబాబును, రంజిత్ కుమార్ ని అనిల్ కుమార్ ని,రెడ్డెమ్మను, గీతమ్మను అభినందించారు.



మాట్లాడుతున్న ఎంఈవో లీలారాణి

అవినీతి సంగతి తేల్చండి?

- రైతుల పొలాలకే మట్టి.. - ఆరోపణలు తగదు
- టిడిపి నాయకుల ధ్వజం

ప్రజాశక్తి -పుంగనూరు: 'చేతగాని ఆరోపణ చేయడం తగదు..కోట్ల రూపాయలు మండల కార్యాలయంలో నిధులు స్వాహా అయితే ఇప్పటి వరకు అవినీతి సంగతి తేల్చలేదు.. రైతుల పొలాలకే మట్టి తోలామని, తమ సొంతానికి కాదని, ఇలా ఆరోపణలు చేయడం అసమంజసం' అని టిడిపి మండల అధ్యక్షుడు గంగ సాని మాధవరెడ్డి, టిడిపి సీనియర్ నేత శ్రీకాంత్ పేర్కొన్నారు. మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, ఎంపీటీసీలు పలు ఆరోపణలు టిడిపిపై చేయగా శనివారం టిడిపి నాయకులు ఘాటుగా స్పందించారు. టమోటో సీజన్ ప్రారంభంలో రైతులు పొలాలకు చెరువులో నుండి మట్టి తోలుకొని పంటలు సాగు చేస్తారని చెప్పారు. అంతేకానీ టిడిపి నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారాలకే మట్టి తోలుకుంటున్నారని ఆరోపణలు చేయడం అర్థ రహితమన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన వారు కూడా ఇలాంటి ఆరోపణలు చేయడం సమంజసంగా లేదన్నారు. ప్రజా సమస్యలపై ప్రజలు మండల కార్యాలయానికి వస్తుంటారని వాటిని పరిష్కరించేందుకే తాము వారికి అందుబాటులో ఉంటామని చెప్పారు. ప్రోటోకాల్ అని మాట్లాడుతారే గతంలో మీరు ప్రోటోకాల్ ఎంతవరకు ఆచరించాలని ప్రశ్నించారు. 'మీ అక్రమాలు దౌర్జన్యాలు రౌడీయిజాన్ని చూసే రాష్ట్రంలో వైసిపిని ప్రజల దూరం పెట్టారు.. ఇంకా మీలో మార్పు రాకపోతే చిరస్థాయిగా ప్రజలకు దూరమవుతారు.. అసైన్డ్ భూములన్ని ఆక్రమించుకుంది ఎంపీపీ భాస్కర్ రెడ్డి కాదా? అవి అప్పుడే మరిచిపోయారా?' అని ప్రశ్నించారు. సర్పంచులు, ఎంపీటీసీలు నామినేటెడ్ గా వచ్చారు.. కానీ ప్రజలు చేత ఎన్నిక కాలేదని ఈ సంఘటన మరిచారా?' అని ప్రశ్నించారు. ' మీకు దమ్ముంటే మీ పదవులకు రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి వెళ్లి తిరిగి నిరూపించుకోండి..' అని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో సివిరెడ్డి, పోలీస్ గిరి, బాలాజీ, మొపూరి మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు



గుమ్మడి కుతూహలమ్మకు నివాళులర్పిస్తున్న వైసిపి నాయకుడు

కుతూహలమ్మ సేవలు మరువలేనివి

వైసిపి నాయకుడు ఆనగంటి హరికృష్ణ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మాజీ డిప్యూటీ స్పీకర్, మాజీ మంత్రి కుతూహలమ్మ సేవలు మరువలేని వని ఆమె కుమారుడు వైసిపి నాయకులు ఆనగంటి హరికృష్ణ అన్నారు. శనివారం డాక్టర్ కుతూహలమ్మ రెండవ వర్ధంతిని పురస్కరించుకుని గంగాధర నెల్లూరు మండలంలో వీఎల్‌ఆర్ పల్లె లోని ఆమె సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, ఘన నివాళులర్పించి, ఆమె సేవలను గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు మాజీ సర్పంచ్ గోవిందయ్య, మాజీ డిసిసి డైరెక్టర్ నాగరాజు రెడ్డి, భీమశంకర్ రెడ్డి, లోకేష్ రెడ్డి, విజయబాబు, కుట్టి, నాగేష్, యువరాజు పాల్గొన్నారు.



మునెమ్మకు నివాళులర్పిస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి

మాజీ సర్పంచ్ మునెమ్మకు నివాళి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వేల్కూరు గ్రామ పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ మునెమ్మ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. వేల్కూరు గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు కుట్టి తల్లి, మాజీ సర్పంచ్ మునెమ్మ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న జిడి నెల్లూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి , చిత్తూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి విజయా నంద రెడ్డి మునెమ్మ భౌతిక దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఓదార్చి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు, మాజీ సిడిసిఎంఎస్ అధ్యక్షులు వేల్కూరు బాబు రెడ్డి, మండల వైస్ ఎంపీపీ హరిబాబు, మాజీ జిల్లా రైతు అధ్యక్షులు వెంకటరెడ్డి, కేశవరెడ్డి, శేఖర్, ఢిల్లీ, జగదీష్ బాబు, వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వాటర్ షెడ్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి -రొంపిచర్ల :రొంపిచర్ల మండలం పెద్ద గొట్టిగల్లు గ్రామ పంచాయతీలో పుంగనూరు టిడిపి ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి వాటర్ షెడ్ కమిటీ సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా చల్లా బాబు మాట్లాడుతూ వాటర్ షెడ్ కమిటీల ద్వారా రైతులకు ప్రభుత్వం ద్వారా సబ్సిడీలో పని ముట్లు అంది స్తామని తెలిపారు. తీన్ని రైతులు వినియోగించు కోవా లన్నారు. పెద్ద గొట్టిగల్లు గ్రామ పంచాయతీలో ఒక కోటి 95 లక్షల నిధులు ఉండగా ఈ ఏడాది 95 లక్షలు మాత్రమే ఖర్చు చేశా మన్నారు. మిగిలిన కోటి రూపాయల వరకు రైతులకు సంబంధించి చెరువు కట్టల నిర్మాణం, నీటి గుంతలు, చెక్ డాములు చేపట్టవచ్చున్నారు. రైతుల సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించుకోవచ్చని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు.

ఘనంగా జాతీయ ఉర్దూ దినోత్సవం

ప్రజాశక్తి -యాదమరి: యాదమరి మండలం తలవాయిపల్లి ప్రాథమిక పూర్ణత పాఠశాలలో జాతీయ ఉర్దూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఉర్దూ దినోత్సవం సందర్భంగా మండల విద్యాశాఖ అధికారిణి రుక్మిణి, ప్రసాద్ పాల్గొన్నారు. ఎండి సర్దార్ ఎస్ జి టి ఉర్దూ భాష గొప్పతనాన్ని వివరించారు. ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, పిల్లి హెచ్‌ఎం పద్మజ, రాధిక, దయ, దినకర్, యుటిఎఫ్ జిల్లా మహిళా కార్యదర్శి రెహనా బేగం పాల్గొన్నారు.



ఉర్దూ ఉపాధ్యాయునికి సన్మానం

జర్నలిస్టు గోపీనాథ్ రెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ గోపీనాథ్ రెడ్డికి ఏపీడబ్ల్యూజేఎఫ్ ఘన నివాళి అర్పించింది. ఈ మేరకు ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు శనివారం మధ్యాహ్నం తవణంపల్లి మండలం తొడతరలోని గోపీనాథ్ రెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయన భౌతిక దేహానికి అశ్రు నివాళి అర్పించారు. సంతాప సూచకంగా రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. అనంతరం ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి ప్రకాష్ రెడ్డి, షేక్ సలీం మాట్లాడుతూ ఆయన పత్రికా రంగానికి చేసిన సేవలను మరుపురాని వన్నారు. విధి నిర్వహణలో గోపీనాథ్ రెడ్డి ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి, అధికారులకు తెలుపుతూ పరిష్కరించేవారని ప్రశంసించారు. పత్రిక రంగానికి సహచర జర్నలిస్టులకు ఆయన లేని లోటు తీరలేనిదన్నారు. అభ్యుదయ భావాలను నింపుకొని నిరంతరం ప్రజా సమస్యలే తన సమస్యగా భావించి పరిష్కరించడంలో గోపీనాథ్ దిట్ట అని ప్రశంసించారు. నేటితరం పాత్రికేయులు గోపీనాథ్ రెడ్డిని ఆదర్శంగా తీసుకొని పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యలు పరిష్క రిం చడంలో ప్రత్యేక పాత్ర పోషించాలని సూచించారు. కుటుంబ సభ్యులకు ఏపీడబ్ల్యూజేఎఫ్ ఎల్లవేళలా అండగా ఉంటుందని మనోధైర్యం కల్పించి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి పి కృపానంద రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి ఎస్ జె దినేష్ కుమార్, సంయుక్త కార్యదర్శి యాద వేంద్రరెడ్డి, చిత్తూరు నియోజకవర్గ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ కేశ వులు, బాలసుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎంనాగరాజు, సంయుక్త కార్యదర్శి కుబేంద్రన్, పుంగనూరు నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీష్ కుమార్, ఇనయతుల్లా, కోశాధికారి భాను ప్రకాష్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియే షన్(ఏపీ జేబీఏ) జిల్లా ఉపాధ్యక్షులు టి కృష్ణమూర్తి రెడ్డి, పూతలపట్టు నియోజకవర్గ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.



జర్నలిస్టు గోపీనాథ్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

క్రైం న్యూస్

బెల్ట్ షాపు నడుపుతున్న ఇద్దరు అరెస్ట్: సిఐ

ప్రజాశక్తి -బంగారుపాలెం: బెల్ట్ షాప్ నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సీఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం బంగారు పాలెం దళితవాడలో మద్యం విక్రయిస్తున్నారని సమాచార రావడంతో దాడులు చేయడంతో గ్రామానికి చెందిన కాలెప్ప ,సెల్వ రాజులను అదుపులో తీసుకుని వారి నుండి 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని పోలీసులు తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామచంద్రారెడ్డి , హెడ్ కానిస్టేబుల్ బాబు ,కిరణ్ , దావూద్ పోలీస్ రమేషు, ద్వారకానాథ్ పాల్గొన్నారు.

చింత చెట్టు నుండి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చౌడేపల్లి: చింతకాయలు కోస్తుండగా ప్రమాద వశాత్తు చెట్టు నుండి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చౌడేపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథల మేరకు.. మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ బండమీద పలికి చెందిన గంగాధరం (28) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో పెద్ద ఎల్లుకుంట్ల పంచాయతీ ఊటూరు వద్ద చింత కాయలు కోసేందుకు చింత చెట్టు ఎక్కి కోస్తుండగా ప్రమాదవశాత్తు కిందికి పడిపోయాడు. వెంటనే చుట్టుపక్కల కూలీలు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే గంగాధరం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పనుల కోసం వెళ్లి మృతి చెందిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి-చౌడేపల్లి: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు... మండలంలోని పరికెదుల పంచాయతీ దొనపల్లి వద్ద అక్రమంగా ఆంధ్ర మద్యం విక్రయిస్తున్న అదే గ్రామానికి చెందిన వెంకటరమణను అదుపులోకి తీసుకొని అతని నుంచి 15 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

1200 గ్రాముల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : గంజాయి తరలిస్తున్న దంపతులను శనివారం సీఐ మహేశ్వర్ అరెస్టు చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గంజాయి తరలింపుపై వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయలుతో పాటు ఓజీకుప్పం గ్రామ మార్గంలో కాపుకాసి గంజాయి తరలిస్తున్న దంపతులు జి.నరసింహులు (56), పుష్పవతి (48)అను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.25వేలు మతింపు చేసే 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా


ప్రజాశక్తి -విజయపురం (నగరి): బహిరంగంగా మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం కేసుల్లో ఏడుగురికి ఇన్‌చార్జి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గోపాలకృష్ణ శనివారం జరిమానా విధించినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. బహిరంగ మద్యం సేవించిన కేసులో నలుగురిని అరెస్టు చేయగా వారికి ఒకరికి వెయ్యి రూపాయలు చొప్పున జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ముగ్గురిని అరెస్టు చేయగా వారికి ఒకరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించామన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొని వాహనం బోల్తా

-ముగ్గురికి తీవ్ర గాయాలు- ఏడుగురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: కరెంటు స్తంభాన్ని ఢీకొని టాటా ఏసీ వాహనం బోల్తా కొట్టిన సంఘటన శనివారం మండలంలోని ముక్కలతూరు వద్ద చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు గంగాధర నెల్లూరు మండలం ముక్కల్తూరు పంచాయతీ ఎం నాసంపల్లి సమీపంలోని కాసా బిల్డింగ్ వద్ద శనివారం టాటా ఏస్ ఆటో బోల్తా పడి రోడ్డు ప్రమాదం జరిగింది . వేల్కూరులోని ఇందిరానగర్ గ్రామంలో ఓ చావుకు వెళ్తూ అతివేగంగా వేగంగా వెళుతున్న టాటా ఏస్ ఆటో వాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. స్థానికుల సమాచార మేరకు వెంటనే స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అత్యవసర వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు . తీవ్రంగా గాయపడిన ఇంద్రాణి ,మేరి, దేవరాజులు తీవ్ర గాయాలు కాగా మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాయాలైన వారు చిత్తూరు ప్రభుత్వ చికిత్స పొందుతున్నారని తెలిపారు. గంగాధర నెల్లూరు మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన వారే గాయపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు స్థానిక సీఐ శ్రీనివాసంతి తెలిపారు.

కుప్పం పబ్లిక్ స్కూలు విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని జాహ్నవి

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని కుప్పం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి, ఉత్తమ ప్రతిభను కనబరుస్తూ, ఉన్నత శిఖరా లను అధిరోహించడం ఆనందంగా ఉందని ఆ పాఠశాల ఛైర్‌పర్సన్ నాగరాజు తెలిపారు. శనివారం పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం తమ విద్యార్థిని జాహ్నవిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణానికి చెందిన కమతమూరు లోని బాల సుబ్రహ్మణ్యం కుమార్తె ప్రాథమిక విద్య నుండి పదవ తరగతి వరకు సభ పాఠశాలలో చదివినట్టు తెలిపారు. అనంతరం ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేసిన తను ప్రస్తుతం జేఈఈ మెయిన్స్‌లో 82 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

సీఎంతో సేవాలాల్ జయంతిలో టిడిపి నేతలు



ప్రజాశక్తి - రామకుప్పం: ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సంత్ సేవాలాల్ 286 జయంతి ఉత్సవాల్లో రామకుప్పం టిడిపి గిరిజన నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారు నాయక్ తదితరులతో కలిసి సంత్ సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంలో రాజకీయాలకు అతీతంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కృష్ణ నాయక్, ధనపాల్ నాయక్ లు పాల్గొన్నారు.

ఘనంగా 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్'

ప్రజాశక్తి -వెదురుకుప్పం: స్వర్ణాంధ్ర – స్వచ్ఛ దివస్‌లో భాగంగా డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిసరాల పరిశుభ్రత – పచ్చదనం పెంపు కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఇందులో భాగంగా కళాశాల ఆవరణ, కళాశాల ప్రయోగశాలను విద్యార్థులు శుభ్రం చేశారు. కళాశాల ఆవరణలో దుమ్ము దులిపి, ఆవరణలను తరగతి గదులను పూర్తిగా శుభ్రం చేశారు. కళాశాల ఆవరణలలో మొక్కలు నాటారు. కార్యాలయంలో ఇండోర్ మొక్కలు పెంపును చేపట్టారు. పరిసరాల శుభ్రత విషయంలో విద్యార్థులు ముందుం డాలని కళాశాల ప్రిన్సిపాల్ సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి అన్నపూర్ణ, శారద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సి మంగళ గౌరీ, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి వెంకటేష్ , ఇతర అధ్యాపక అధ్యాప కేతరులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సోమల: సోమల సచివాలయంలో చెత్త నుండి సంపద కేంద్రం వద్ద నాయకులు అధికారులు మొక్కలు నాటారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ, హౌసింగ్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కందూరు ఎస్‌డబ్ల్యూపిసి వద్ద మొక్కలు నాటారు. ఇరికిపెంట సచివాలయ పరిసరాలు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాలలో ఈవోఆర్డీ లక్ష్మీదేవి, మండల టిడిపి అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, పీఎం మల్లికార్జున, చినబాబు, శంకర, పంచాయతీ కార్యదర్శులు మేనక, జయశంకర్, ఆనంద్ పాల్గొన్నారు.

సదుం : సదుం ఇన్‌ఛార్జి ఎంపీడీవో డిఎస్ హరిబాబు, తహశీల్దారు మారూప్ హుస్సేన్, జెడ్పి హైస్కూలు ప్రధానోపాధ్యాయులు వై. జయ కుమార్ రెడ్డి, సదుం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇ పుష్పకుమారి, చెరుకు వారి పల్లి పిహెచ్ సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గిరీష ఆధ్వర్యంలో శనివారం పాఠశాల విద్యార్థులు సదుంలో ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలలో పిచ్చిమొక్కలు తొలగించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో శ్రీనివాసులు, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఉదయభాస్కర్, నర్సులు, వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీపురుపట్టిన ఎమ్మెల్యే

ఐరాల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి వారి క్షేత్రం వద్ద నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్‌కు విచ్చేసిన పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ స్వయంగా చేతితో చీపుర పట్టి, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి రోడ్లను శుభ్రపరిచారు. కాణిపాకం గ్రామస్తులు, యువత, మహిళా సంఘాలు, ప్రభుత్వ అధికారులతో పాటుగా పారిశుద్ధ్య కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల టిడిపి అధ్యక్షులు గిరిధర్ బాబు, మాజీ కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్ రావు, నాయకులు మోహన్ నాయుడు, శేఖర్ బాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఈఓపి ఆర్‌డి కుసుమకుమారి, గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



ఐరాలలో చీపురు పట్టి వీధిని శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మురళీ మోహన్

యాదమరి: స్వచ్ఛ ఆంధ్ర సాధనలో అందరూ భాగస్వాములై రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద యునాని వైద్యాధికారిణి డాక్టర్ తులసి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణలు సిబ్బంది వద్ద ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ తులసి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ సలహాలు ఇచ్చారు. ప్రతివారం ఫ్రైడే– డ్రైడే నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి తులసి, సిహెచ్ లక్ష్మీనారాయణ, సూపరువైజర్ సెల్వి రాణి, లక్ష్మీపతి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: స్థానిక సిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారిణి శిరీష ఆధ్వర్యంలో 'స్వచ్ఛ ఆంధ్రా– స్వచ్ఛ దివస్‌ను నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టారు. వైద్యులు, సిబ్బంది ఆస్పత్రి పరిసరాలు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు భార్గవ్, స్వరూప్, అఖిల్, శాలిని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండల ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో స్వర్ణ ఆంధ్ర –స్వచ్ఛ దివస్' నిర్వహించారు. ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పరిసరాలు శుభ్రతతో ఆరోగ్యవంతంగా వుండ వచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపిడివో స్వయంగా చీపురు పట్టి చెత్త ఊడ్చి పరిశుభ్రతలో ఎంపీడీవో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసా య అధికారి భవాని, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయపురం: స్థానిక మండలంలో ఇల్లత్తూరు గ్రామ పంచాయతీలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్‌లో పంచాయతీ కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, టిడిపి నాయకులు భాస్కర్ రాజు, వరదరాజులు, చెల్లయ్య, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

రొంపిచర్ల: రొంపిచర్ల మండలంలోని బండ కింద పల్లి గ్రామ పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్‌ను బండ కింద పల్లె టిడిపి అధ్యక్షులు ఊటుకూరు మదన్మోహన్ రెడ్డి, సచివాలయ సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులు చేపట్టారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద తడి చెత్త, పొడి చెత్త ద్వారా ఎరువుల తయారీ, వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఇ వెంకటరమణ, నాయకులు మట్టి రమణారెడ్డి, సదుం చంద్రారెడ్డి, వాటర్ షెడ్ ఛైర్మన్ భాస్కరయ్య, గ్రామ సర్పంచ్ అన్సర్ బాష, ఖాదరవల్లి, నౌషాద్ పాల్గొన్నారు.

యాదమరి: చిత్తూరులోని డిఆర్డీఏ కార్యాలయంతో పాటు, జిల్లా సమాఖ్య ప్రాంగణంలో డిఆర్‌డిఏ, అధికారులు, సిబ్బంది శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు డిఆర్డీఏ పీడీ శ్రీదేవి, అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పం రూరల్ : కుప్పం పట్టణంలో స్వచ్ఛ కుప్పం కార్యక్రమాన్ని పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు నిర్వహించారు. పట్టణంలోని 19 వ వార్డు పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, కొత్తపేట నేతాజీ రోడ్డులో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తపేట నేతాజీ రోడ్డు పరిధిలో పారిశుధ్యం పనులు కార్మికులు నిర్వహించగా, వాటిని కన్నన్ పరిశీలిం చారు. 19వ వార్డు పరిధిలో స్వయంగా పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ చెత్త చెదారం శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రొంపిచర్ల : రొంపిచర్లలో నిర్వహించిన 'స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ – స్వచ్ఛ దివస్'లో చల్లా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేసి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలు సమస్యలతో వచ్చే వారికి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రొంపిచర్ల మండలం టిడిపి అధ్యక్షుడు ఉయ్యాల రమణ, ప్రభుత్వ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛాంధ్ర దివస్‌ను నిర్వహించారు.

పలమనేరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 'స్వర్ణ ఆంధ్ర –స్వచ్ఛ దివస్‌లో భాగంగా పలమనేరు పురపాలక సంఘ పరిధిలోని అన్నీ వార్డుల సచివాలయాలలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా హోమ్ కంపోస్టింగ్, ఇంటి వ్యర్థాల నిర్వహణ, తడిచెత్త పొడిచెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్ , అసిస్టెంట్ ఇంజనీర్ స్నేహ ప్రియ , టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి

భద్రత కట్టుదిట్టం చేయాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలో గంగమ్మ జాతర సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని డిఎస్‌పి ప్రభాకర్ తమ సిబ్బందిని ఆదేశించారు. బైరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో గంగజాతరకు భద్రత ఏర్పాట్లపై తమ సిబ్బందితో డిఎస్‌పి ప్రభాకర్ బైరెడ్డిపల్లిలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ బైరెడ్డిపల్లిలో నిర్వహించే గంగ జాతరలో భాగంగా గంగమ్మ విగ్రహం ఊరేగింపునకు సిబ్బంది వారి వారి విధులు సక్రమంగా నిర్వహించి శాంతి యుతంగా అమ్మవారి విగ్రహ ఊరేగింపు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో పలమనేరు రూరల్ సీఐ మురళి, గంగవరం సీఐ ప్రసాద్, చౌడేపల్లి సిఐ రాంభూపాల్, సోమల ఎస్ఐ శివశంకర్, ఎస్ఐ సహదేవి, పలమనేరు సబ్ డివిజన్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారని స్థానిక ఎస్ఐ పరశురాముడు తెలిపారు.

ముగిసిన మహిళల శిక్షణ

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణం కడా కార్యాలయంలో అలీప్ సంస్థ ప్రత్యేకంగా మహిళలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం నాడు ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిటిడి పాలకమండలి సభ్యులు శాంతారామ్ విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సాధికారతకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నట్టు తెలిపారు. ప్రతినిత్యం మహిళల అభివృద్ధి కోసం ఆలోచిస్తూ వినూత్న పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు, ప్రతి రంగంలోనూ మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారని, ఇందులో భాగంగానే కుప్పం నియోజకవర్గ పరిధిలో మహిళ పారిశ్రామిక తోడ్పాటులో భాగంగా ఔత్సాహిక మహిళలకు పారిశ్రామిక రంగంపై శిక్షణ అందించినట్టు తెలిపారు.